# ప్రజానేస్తం జ్వాల

నిజం కోసం... నిర్భయంగా...

www.prajanesthamjwalanews.com | prajanesthamnews@gmail.com

సంపుటి : 1 సంచిక : 2 ఎడిటర్:చెన్నగాని పురుషోత్తం శనివారం 3 అక్టోబర్ 2026 పేజీలు : 4 వెల : 4/-




## రాయలసీమ రైతుల తల రాతలు మారబోతున్నాయి

- రాయలసీమలో గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు అంకురార్పణ
- మదనపల్లెలో శంకుస్థాపన చేసిన నిర్మలా సీతారామన్, చంద్రబాబు
- రైతులకు సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారన్న పవన్

## డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా

# అల్పాహార పథకం

- పాఠశాలల్లో అల్పాహార పథకం..
- సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు
- సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు
- నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో వంటశాలల కోసం ముందుకొచ్చిన ప్రైవేటు సంస్థలు
- నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం
- ఆహార నాణ్యత పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు చేయాలని సూచన



హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో, అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరపున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ. 5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరపున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ. 4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహారం విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం - మిగతా3లో



## గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే భావజాలాన్ని తిప్పికొట్టాలి

- గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ సీఎం భట్టి
- గాడ్సే భావజాలాన్ని ప్రతిఒక్కరూ తిప్పికొట్టాలని పిలుపు
- గాంధీ ఆశయాల స్ఫూర్తితోనే తమ ప్రజా ప్రభుత్వం పాలన
- అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్కూళ్ల ఏర్పాటు
- వివక్ష లేని సమాజ నిర్మాణమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టీకరణ

హైదరాబాద్

గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతిపిత మహాత్మా గాంధీకి తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఘన నివాళులర్పించారు. గాంధీజీ ఆశయాల స్ఫూర్తితోనే రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని, వివక్ష లేని సమాజ నిర్మాణమే తమ ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం - మిగతా3లో




## తెలంగాణలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు

- 12 ఏళ్ల తర్వాత పెంపు
- తెలంగాణలో 12 ఏళ్ల తర్వాత సవరించిన ఆటో ఛార్జీలు
- కనీస ఛార్జీ రూ. 30, ఆ తర్వాత కిలోమీటరుకు రూ. 14గా నిర్ధారణ
- రాత్రి 11 నుంచి ఉదయం 5 వరకు ఒకటిన్నర రెట్లు అధిక ఛార్జీ
- మూడు నెలల్లో మీటర్లు మార్చాలని డ్రైవర్లకు ఆదేశాలు
- పెరిగిన ఖర్చుల దృష్ట్యా ప్రభుత్వ కమిటీ సిఫారసులతో నిర్ణయం



## బీజేపీలో చేరిన సీరియల్ నటులు..

- ఆహ్వానించిన రాంచందర్ రావు
- బీజేపీలో చేరిన స్వర్ణలత తదితర నటులు
- సామాన్యులను కాంగ్రెస్, బీఆర్ఎస్ పట్టించుకోవడం లేదని రాంచందర్ రావు విమర్శ

## రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

- ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడి
- యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపేందుకు ప్రయత్నాలు
- కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందపడుతున్నాయి
- నల్గొండకు 5,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తా



### మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతిలో

# నివాళులర్పించిన వైయస్ జగన్



తాడేపల్లి బ్యూరో

మహాత్మా గాంధీ, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి పురస్కరించుకొని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లిలోని తన నివాసంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్య సమరానికి మహాత్మా గాంధీ అందించిన సేవలను, దేశ నిర్మాణంలో లాల్ బహదూర్ శాస్త్రి పోషించిన పాత్రను ఈ సందర్భంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మల్లాది విష్ణు, దేవినేని అవినాష్, రాయన భాగ్యలక్ష్మి, పూనూరు గౌతమ్‌రెడ్డి, వంగవీటి నరేంద్ర, అంకంరెడ్డి నాగనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



## నాటి యువగళం హామీ.. నేడు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా సాకారం!

- ‘యువగళం’ పాదయాత్ర హామీని నెరవేర్చిన కూటమి ప్రభుత్వం
- రాయలసీమలో రూ. లక్ష కోట్లతో గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం
- మదనపల్లె వేదికగా ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రారంభించిన సర్కార్
- ‘సీడ్ టు షిప్‌మెంట్’ విధానంలో ఉద్యాన రైతులకు పూర్తిస్థాయి చేయూత
- ప్రపంచానికే ‘ఫ్రూట్ బౌల్’గా

# లక్షలు ఖర్చు.. వైద్యం మాత్రం దూరం!

## పదేళ్లుగా ప్రారంభానికి నోచుకోని నిషాని ఆరోగ్య ఉపకేంద్రం

## 1,200 మందికి పైగా ప్రజలకు 20 కిలోమీటర్ల ప్రయాణమే దిక్కు

**కెరమెరి, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా(ప్రజానేస్తం జ్వాల):** ఆదివాసులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం.. పదేళ్లు గడిచినా ప్రజలకు అందుబాటులోకి రాలేదు. కెరమెరి మండలంలోని నిషాని గ్రామంలో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం సిబ్బంది లేక నిరుపయోగంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 1,200 మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. చిన్నపాటి అనారోగ్య సమస్య వచ్చినా వైద్యం కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామం నుంచి సుమారు 15 నుంచి 20 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోంది.

**భవనం ఉంది.. వైద్యం లేదు!**

లక్షలు వెచ్చించి నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రానికి వైద్య సిబ్బందిని నియమించకపోవడంతో భవనం ఉన్నా ప్రయోజనం లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులు, చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాధారణ జ్వరం, దగ్గు, జలుబు వంటి సమస్యలకు కూడా దూరప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అత్యవసర



సమయంలో అంబులెన్స్ అందుబాటులో లేకపోవడం, రహదారి సౌకర్యం సరిగా లేకపోవడం సమస్యను మరింత తీవ్రం చేస్తోందని గ్రామస్తులు అంటున్నారు.

**వర్షాకాలంలో మరింత ఇక్కట్లు**

నిషాని గ్రామానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారుతోంది. రోడ్లు బురదమయంగా మారడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు సైతం ప్రయాణించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

# వైద్యం కోసం 20 కిలోమీటర్లు!

**సిబ్బంది లేక సేవలు కరువు.. సీజనల్ వ్యాధులతో ప్రజల అవస్థలు**

**గర్భిణులు, చిన్నారులు, వృద్ధులకు తప్పని దూర ప్రయాణం**

నిషాని గ్రామ ప్రజలకు అత్యవసర సమయాల్లో వైద్య సేవలు అందడం కష్టంగా మారింది. గ్రామం నుంచి మండల కేంద్రం లేదా ఇతర ఆస్పత్రులకు వెళ్లాలంటే సుమారు 20 కిలోమీటర్ల ప్రయాణం తప్పడం లేదు. సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో రోగులను ఆస్పత్రులకు తరలించడం కూడా ఇబ్బందికరంగా మారుతోంది.

**మందులు కూడా అందుబాటులో లేవు**

ఆరోగ్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో సాధారణ మందులు, ఇంజెక్షన్లు కూడా గ్రామంలో లభించడం లేదని స్థానికులు చెబుతున్నారు. చిన్నపిల్లలకు టీకాలు వేయించేందుకు సైతం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని అంటున్నారు. వృద్ధులు వైద్యుల వద్దకు వెళ్లేందుకు శారీరకంగా ఇబ్బంది పడుతున్నారు. గర్భిణులకు అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

**సీజనల్ వ్యాధుల సమయంలో అవస్థలు**

ప్రతి ఏడాది వర్షాకాలంలో జ్వరాలు, ఇతర సీజనల్ వ్యాధులతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో కొందరు ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

**'ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభించాలి'**

ఆత్రం దేవరావు, నిషాని: "ఆరోగ్య ఉపకేంద్రం నిర్మించి పదేళ్లు పూర్తయింది. కానీ ఇప్పటివరకు వైద్య సిబ్బందిని నియమించలేదు. లక్షలు ఖర్చు చేసిన భవనం ప్రజలకు ఉపయోగపడటం లేదు. ప్రభుత్వం వెంటనే వైద్య సిబ్బందిని నియమించి ఆరోగ్య ఉపకేంద్రాన్ని ప్రారంభించాలి."

**'వైద్య సేవలు అందేలా చూడాలి'**

**మడవి అరుణ, ఫారెస్ట్ కమిటీ చైర్మన్, నిషాని:**
"వర్షాకాలంలో సీజనల్ వ్యాధులతో చాలామంది ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో గర్భిణులు, వృద్ధులను ఆస్పత్రులకు తీసుకెళ్లాలంటే 20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి ఆరోగ్య ఉపకేంద్రంలో సిబ్బందిని నియమించాలి."

**తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్**

నిషాని గ్రామ ప్రజల ఆరోగ్య సమస్యలపై అధికారులు తక్షణం స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఆరోగ్య ఉపకేంద్రాన్ని పూర్తిస్థాయిలో ప్రారంభించి వైద్య సిబ్బందిని నియమించాలని, అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు.

అత్యవసర పరిస్థితుల్లో రోగులను వేగంగా ఆస్పత్రులకు తరలించేందుకు రహదారి, రవాణా సౌకర్యాలను కూడా మెరుగుపరచాలని కోరుతున్నారు.

# సూర్యాపేట జిల్లాలో 30 పోలీస్ యాక్ట్ అమలు

**అక్టోబర్ 31 వరకు నిబంధనలు అమల్లో ఉంటాయి.... అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించరాదు.**

**భారీ జనసమూహాలు, ఊరేగింపులకు ముందస్తు అనుమతి తప్పనిసరి... డీజేలు, అధిక శబ్ద స్పీకర్లు, మైకులు, ప్రచార రథాలకు అనుమతి అవసరం.**

**నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు: ఎస్పీ నరసింహ ఐపీఎస్.. ముందస్తు అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు, ధర్నాలకు అనుమతి లేదు**

**నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు: ఎస్పీ నరసింహ ఐపీఎస్**

**సూర్యాపేట, (ప్రజానేస్తం జ్వాల):** సూర్యపేట జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించడంతో పాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా అక్టోబర్ 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ తెలిపారు. 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉన్నందున డీఎస్పీ లేదా అంతకంటే పైస్థాయి పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి లేకుండా ప్రజా సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, భారీ జనసమూహాలు నిర్వహించరాదని ఎస్పీ స్పష్టం చేశారు. ఆయా కార్యక్రమాలకు సంబంధించి ముందస్తు సన్నాహాలు కూడా అనుమతి లేకుండా చేపట్టరాదని సూచించారు.అలాగే నిషేధిత ఆయుధాలు, కత్తులు, కర్రలు, దుడ్డుకర్రలు, తుపాకులు, పేలుడు పదార్థాలు లేదా నేరాలను ప్రేరేపించే ఇతర ఆయుధాలను కలిగి ఉండరాదని తెలిపారు.ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించే విధంగా జనసమూహాలు ఏర్పాటు చేయడం, ప్రజా సమావేశాలు నిర్వహించడం నిషేధించబడిందన్నారు. అధిక శబ్దాన్ని కలిగించే స్పీకర్లు, డీజేలు, ప్రచార రథాలు, మైకులు తదితర పరికరాలను అనుమతి లేకుండా వినియోగించరాదని స్పష్టం చేశారు. 30 పోలీస్ యాక్ట్ కింద జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నా ముందుగానే సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలని సూచించారు.జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని ఎస్పీ నరసింహ ఐపీఎస్ కోరారు.

## మహాత్మా గాంధీ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

-- మండల కాంగ్రెస్ అధ్యక్షులు త్రిపురం అంజన్ రెడ్డి



**గరిడేపల్లి (ప్రజానేస్తం జ్వాల):** సత్యం, అహింసా సిద్ధాంతాలను జీవితాంతం ఆచరిస్తూ దేశ స్వాతంత్ర సాధన కోసం పోరాడిన మహనీయుడు మహాత్మా గాంధీ అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు త్రిపురం అంజన్ రెడ్డి అన్నారు.గాంధీ జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గరిడేపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో, మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా అంజన్ రెడ్డి మాట్లాడుతూ, మహాత్మా గాంధీ అనుసరించిన అహింసా మార్గం, సత్యాగ్రహం ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది నాయకులను ప్రభావితం చేశాయని అన్నారు. గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, సేవా మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని, ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేకపోతుల వెంకటమ్మ చంద్రయ్యతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పరకాలలో అనుమానాస్పద ఘటన.. మహిళ మృతి

**తల్లికి తీవ్ర గాయాలు.. ఎంజీఎం ఆసుపత్రికి తరలింపు**



**పరకాల, (ప్రజానేస్తం జ్వాల ):** హనుమకొండ జిల్లా పరకాల పట్టణంలోని ఆకులవాడలో గురువారం అనుమానాస్పద ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో కోడెల సుగుణక్క (63) అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందగా, ఆమె తల్లి కోడెల లక్ష్మమ్మ (85) తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.స్థానికులు గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. తీవ్రంగా గాయపడిన లక్ష్మమ్మను మెరుగైన వైద్యం కోసం హనుమకొండలోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.సుగుణక్క మృతికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ వివిధ కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం.మృతికి గల పూర్తి కారణాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికావాల్సి ఉంది.

## లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో ఘనంగా గాంధీ, శాస్త్రి జయంతి వేడుకలు

**గాంధీ, శాస్త్రి ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి: లయన్ బట్టు మధు**




**నేరేడుచర్ల (ప్రజానేస్తం జ్వాల):** లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జయంతి, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్లబ్ అధ్యక్షులు షేక్ యూసుఫ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా చైర్‌పర్సన్ లయన్ బట్టు మధు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా లయన్ బట్టు మధు మాట్లాడుతూ.. మహాత్మా గాంధీ అహింసా మార్గంలో సాగించిన స్వాతంత్ర్య పోరాటం, దేశానికి లాల్ బహదూర్ శాస్త్రి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశం కోసం వారు చూపిన త్యాగం, సేవాభావం, క్రమశిక్షణ నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు.విద్యార్థులు గాంధీ, శాస్త్రి ఆశయాలను, విలువలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసిస్తూ జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రధాన కార్యదర్శి సరికొప్పుల నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు గుండా సత్యనారాయణ, జీఎంటీ కోఆర్డినేటర్ లాయర్ విశ్వనాథ్, ఉపాధ్యాయులు సైదులు తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ స్ఫూర్తితో.. బుల్లెట్ ట్రైన్ సాధించి తీరుతాం!

**50వ రోజుకు చేరిన బుల్లెట్ ట్రైన్ సాధన ఉద్యమం**

**గాంధీ విగ్రహం వద్ద మౌన దీక్ష చేపట్టిన అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు**



**సూర్యాపేట జిల్లా కేంద్రం, (ప్రజానేస్తం జ్వాల):** సూర్యాపేట జిల్లా కేంద్రం మీదుగా బుల్లెట్ ట్రైన్ సాధించాలని డిమాండ్ చేస్తూ కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు 50వ రోజుకు చేరుకున్నాయి. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని గురువారం గాంధీ విగ్రహం వద్ద బుల్లెట్ ట్రైన్ సాధన సమితి ఆధ్వర్యంలో మౌన దీక్ష నిర్వహించారు.సాధన సమితి చైర్మన్ ప్రొఫెసర్ ఆరుట్ల జానకి రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జానకి రెడ్డి మాట్లాడుతూ.. సూర్యాపేట జిల్లా మీదుగా బుల్లెట్ ట్రైన్ సాధించాలనే డిమాండ్‌తో 50 రోజులుగా ఉద్యమం కొనసాగుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఆశించిన స్పందన రాకపోవడం బాధాకరమన్నారు. ప్రజా ఉద్యమాల ద్వారా హక్కులను సాధించుకోవచ్చని మహాత్మా గాంధీ చూపిన మార్గం తమకు స్ఫూర్తిదాయకమని తెలిపారు.గాంధీ స్ఫూర్తితో శాంతియుత పద్ధతుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, సూర్యాపేట మీదుగా బుల్లెట్ ట్రైన్ సాధించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో పలువురు అఖిలపక్ష నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, విద్యార్థి నాయకులు, మహిళలు, స్థానిక ప్రజలు పాల్గొని బుల్లెట్ ట్రైన్ సాధనకు తమ మద్దతు తెలిపారు.

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మెమోరాండం

**ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ పిలుపుతో సూర్యాపేటలో నిరసన కార్యక్రమం**

**కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేసిన టీయూడబ్ల్యూజే, ఐజేయూ నేతలు**



**సూర్యాపేట జిల్లా కేంద్రం (ప్రజానేస్తం జ్వాల):** ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో టీయూడబ్ల్యూజే , ఐజేయూ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ కు మెమోరాండం అందజేశారు.ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే ఐజేయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చలసాని శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షుడు కోల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి బంటు కృష్ణ, ప్రెస్ క్లబ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్ శర్మ పాల్గొన్నారు.జిల్లా వ్యాప్తంగా పలువురు జర్నలిస్టులు కార్యక్రమానికి తరలివచ్చి తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## పరకాల సబ్‌జైలులో ఘనంగా గాంధీ జయంతి

**ఖైదీలు తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుని బాధ్యతాయుత పౌరులుగా మారాలి- పర్యవేక్షణ అధికారి ఎన్. ప్రభాకర్ రెడ్డి**



**పరకాల, (ప్రజానేస్తం జ్వాల):** పరకాల సబ్‌జైలులో శుక్రవారం జాతిపిత మహాత్మా గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జైలు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమానికి ఫస్ట్ క్లాస్ మున్సిఫ్ మేజిస్ట్రేట్ శ్రీ సాయి శరత్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీ వంశీకృష్ణ, ఆర్ఎంవో శ్రీ బాలకృష్ణ, ఏజీపీ శ్రీనివాస్, స్థానిక న్యాయవాది శ్రీ రాజమౌళి, జైలు సిబ్బంది, ఖైదీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా పర్యవేక్షణ అధికారి ఎన్. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ, మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, క్షమ, మానవతా విలువలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జైలులో గడిపే కాలాన్ని కేవలం శిక్షగా భావించకుండా, గతంలో చేసిన తప్పులను గుర్తించి సరిదిద్దుకునే అవకాశంగా మలుచుకోవాలని అన్నారు.ఖైదీలు గత అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుని, భవిష్యత్తును సానుకూలంగా తీర్చిదిద్దుకోవాలని, విడుదల అనంతరం గౌరవప్రదమైన, బాధ్యతాయుతమైన జీవితాన్ని కొనసాగించేందుకు కృషి చేయాలని సూచించారు. ముఖ్య అతిథులు మాట్లాడుతూ కోపావేశం లేదా తొందరపాటు నిర్ణయాలతో జరిగే తప్పిదాలు వ్యక్తిగత జీవితంతో పాటు కుటుంబ సభ్యులు, పిల్లలు, బంధువులపై కూడా ప్రభావం చూపుతాయని వివరించారు. ఇకపై తప్పిదాలకు తావులేకుండా చట్టాన్ని గౌరవిస్తూ క్రమశిక్షణతో జీవించాలని ఖైదీలకు సూచించారు.లిజైలు కేవలం శిక్షించే ప్రదేశం మాత్రమే కాకుండా, వ్యక్తిలో మార్పు తీసుకువచ్చి సమాజంలో బాధ్యతాయుతమైన పౌరుడిగా తీర్చిదిద్దే వేదికగా ఉండాలని వారు పేర్కొన్నారు. ఖైదీల సంక్షేమ దినోత్సవం సందర్భంగా విద్య, వృత్తి నైపుణ్యాలు, ఆరోగ్యం, సత్ప్రవర్తనకు సంబంధించిన సంక్షేమ కార్యక్రమాల ప్రాధాన్యతను వివరించారు. విడుదల అనంతరం సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని కొనసాగించేలా ఖైదీలు తమలో సానుకూల మార్పు తీసుకురావాలని సూచించారు.కార్యక్రమం విజయవంతం చేసిన ముఖ్య అతిథులు, న్యాయ అధికారులు, వైద్య అధికారులు, న్యాయవాదులు, జైలు సిబ్బంది, ఖైదీలకు పర్యవేక్షణ అధికారి కృతజ్ఞతలు తెలిపారు.

# అంగన్ మిలన్ సేవలో అంగన్‌వాడీ సిబ్బందికి సత్కారం



**రాయికల్ ,జగిత్యాల జిల్లా (ప్రజానేస్తం జ్వాల):** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో మహిళా మోర్చా ఆధ్వర్యంలో "అంగన్ మిలన్ సేవ" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బోగ శ్రావణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సిబ్బందిని శాలువాలతో సత్కరించిన డాక్టర్ బోగ శ్రావణి.. చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో మాట్లాడి కేంద్రాల్లోని మౌలిక వసతులు, పిల్లలకు అందుతున్న పోషకాహారం, ఇతర సేవలపై వివరాలు తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం "మిషన్ సాక్షం అంగన్‌వాడీ ఒ పోషణ్ 2.0" ద్వారా అంగన్‌వాడీ వ్యవస్థను ఆధునీకరిస్తోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా చిన్నారులకు పోషకాహారం, ప్రీ-స్కూల్ విద్య, ఆరోగ్య--పోషకాహార అవగాహన, ఆరోగ్య పరీక్షలు, టీకాలు, అవసరమైన వారికి రిఫరల్ సేవలు అందించే లక్ష్యంతో చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాయికల్ మండల అధ్యక్షుడు ఆకుల మహేష్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత, జిల్లా మహిళా మోర్చా కోశాధికారి గొడ్డండ్ల అనిత, మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు బద్దం సుజాత, ప్రధాన కార్యదర్శి వట్టిమల్ల శ్రీనివాస్, ఏనుగు రవీందర్ రెడ్డి, మండల కార్యదర్శి సుంకిసాల సత్యం, పాక్స్ చైర్మన్ మైపతి రెడ్డి, బూత్ అధ్యక్షులు అంజి, రవికిరణ్, ఉట్నూర్ నరేష్, గడ్డం సంజీవ్, సాయికుమార్, సీనియర్ నాయకులు కుంట రమేష్ రెడ్డి, గ్రామ సర్పంచ్ నిరటి శ్రీనివాస్, కార్యదర్శి రాజేష్, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, వీడీసీ చైర్మన్ లింబద్రి గౌడ్, వార్డు సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నాటి యువగళం హామీ..

## నేడు గ్లోబల్ హార్టికల్చర్ హబ్‌గా సాకారం!

'యువగళం' పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్ రాయలసీమ రైతాంగానికి ఇచ్చిన కీలక హామీ కార్యరూపం దాల్చింది. రూ.1 లక్ష కోట్ల భారీ ప్రణాళికతో రాయలసీమతో పాటు ఉమ్మడి ప్రకాశం జిల్లాను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా మార్చే 'గ్లోబల్ హార్టికల్చర్ హబ్' (జీహెచ్‌హెచ్)కు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మదనపల్లె వేదికగా ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును ప్రారంభించింది. ఈ పథకం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే కాక, ప్రపంచానికే 'ఫ్రూట్ బౌల్'గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

**రూ. లక్ష కోట్లతో సమగ్ర ప్రణాళిక**

గ్లోబల్ హార్టికల్చర్ హబ్ అభివృద్ధి కోసం రాబోయే మూడేళ్లలో ప్రభుత్వం రూ.40,352 కోట్లు ఖర్చు చేయనుంది. దీనికి అదనంగా, ప్రైవేట్ రంగం నుంచి మరో రూ.60,000 కోట్ల పెట్టుబడులను ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించారు. 'సీడ్ టు షిప్‌మెంట్' విధానంలో విత్తనం వేసిన దగ్గర నుంచి పంటను ఎగుమతి చేసే వరకు ప్రతి దశలోనూ ఉద్యాన రైతులకు అండగా నిలవడమే ఈ హబ్ ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా సాగునీటి ప్రాజెక్టులు, డ్రిప్ ఇరిగేషన్, రహదారుల నిర్మాణం, కోల్డ్ స్టోరేజీలు, లాజిస్టిక్స్ వంటి మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివిధ శాఖలతో సమీక్షలు జరపడంతో పాటు, కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరిపి ఈ ప్రాజెక్టుకు నిధులు సమకూర్చేలా ఒప్పించారు.

**పాదయాత్రలో చూసి.. మిషన్ రాయలసీమగా మార్చి..**

గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నారా లోకేశ్ 'యువగళం' పేరుతో చరిత్రాత్మక పాదయాత్ర చేపట్టారు. రాయలసీమలో 124 రోజుల పాటు 1,587 కిలోమీటర్లు నడిచి, 44 నియోజకవర్గాల్లో పర్యటించారు. ఆ సమయంలో లక్షలాది మంది రైతులను నేరుగా కలిసి వారి కష్టాలను ప్రత్యక్షంగా చూశారు. వారి ఇబ్బందులు చూసి చలించిపోయిన లోకేశ్.. 2023 జూన్ 7న కడపలో 'మిషన్ రాయలసీమ'ను ప్రకటించారు. హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరందిస్తామని భరోసా ఇచ్చారు. 90 శాతం సబ్సిడీతో డ్రిప్ ఇరిగేషన్, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించేందుకు ప్రత్యేక కార్యాచరణ, ఫుడ్ ప్రాసెసింగ్, పల్పింగ్ యూనిట్ల ఏర్పాటు వంటి హామీలను ఆనాడు ఇచ్చారు.

**కరవు సీమ నుంచి ఫలాల సీమగా..**

ఒకప్పుడు కరవుకు చిరునామాగా ఉన్న రాయలసీమ, ఈ గ్లోబల్ హార్టికల్చర్ హబ్ ద్వారా దేశంలోనే అగ్రగామి ఉద్యాన ప్రాంతంగా మారనుంది. మామిడి, అరటి, టమాటా, దానిమ్మ, బొప్పాయి, స్వీట్ ఆరెంజ్ వంటి సంప్రదాయ పంటలతో పాటు ఖర్జూరం, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, ఆపిల్ బెర్రీస్ వంటి అధిక విలువ కలిగిన కొత్త రకం పంటల సాగుకు ప్రోత్సాహం లభించనుంది. ఈ బృహత్తర ప్రాజెక్టు రైతుల ఆదాయాన్ని పెంచడం, గ్రామీణ యువతకు ఉపాధి కల్పించడంతో పాటు 'స్వర్ణాంధ్ర 2047' లక్ష్య సాధనలో కీలక పాత్ర పోషించనుంది.

## గాంధీకి వ్యతిరేకంగా ఉన్న గాడ్సే

## భావజాలాన్ని తిప్పికొట్టాలి

-మొదటిపేజీ తరువాయి

చేశారు. గాడ్సే భావజాలాన్ని వ్యాప్తి చేస్తూ, స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రను వక్రీకరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలను ప్రతి ఒక్కరూ ఐక్యంగా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో టీపీసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో ఉప ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి ఆయన శ్రద్ధాంజలి ఘటించారు. సత్యం, అహింస, శాంతి మార్గాల ద్వారా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించేలా చేసిన గాంధీజీ ఆశయాలు సదా స్ఫూర్తిదాయకమని ఈ సందర్భంగా కొనియాడారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, గాంధీజీ చూపిన మార్గంలోనే తమ ప్రభుత్వం పయనిస్తోందని పేర్కొన్నారు. కులమతాలకు అతీతంగా విద్యార్థులందరికీ అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యను అందించాలనే ఉద్దేశంతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల'ను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. వివక్షకు తావులేని సమసమాజ నిర్మాణమే ప్రజా పాలన అంతిమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా అల్పాహార పథకం

-మొదటిపేజీ తరువాయి

ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం, నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## తెలంగాణలో భారీగా పెరిగిన ఆటో ఛార్జీలు..

తెలంగాణలో సామాన్యులపై మరో భారం పడింది. రాష్ట్రవ్యాప్తంగా ఆటో రిక్షా ఛార్జీలను పెంచుతూ రవాణా శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. దాదాపు 12 ఏళ్ల విరామం తర్వాత ఈ ఛార్జీలను సవరించడం గమనార్హం. నూతన ఛార్జీల ప్రకారం, కనీస ఛార్జీని (తొలి 1.6 కిలోమీటర్లకు) రూ.30గా నిర్ణయించారు. ఆ తర్వాత ప్రయాణించే ప్రతి అదనపు కిలోమీటరుకు రూ.14 చొప్పున వసూలు చేయనున్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం, రాత్రి సమయ ఛార్జీలను కూడా సవరించారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజామున 5 గంటల మధ్య సాధారణ ఛార్జీపై ఒకటిన్నర రెట్లు అధికంగా వసూలు చేస్తారు. ప్రయాణికుల కోసం వేచి ఉండే సమయానికి (వెయిటింగ్ ఛార్జీలు) నిమిషానికి 75 పైసలుగా ఖరారు చేశారు. ప్రస్తుతం ఉన్న డిజిటల్ మీటర్లను కొత్త ఛార్జీలకు అనుగుణంగా మార్చుకునేందుకు ఆటో డ్రైవర్లకు మూడు నెలల గడువు ఇచ్చారు. ఈలోగా పాత, కొత్త ఛార్జీల వివరాలతో కూడిన టారిఫ్ కార్డులను ఆటోల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని ప్రభుత్వం ఆదేశించింది. చివరిసారిగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో 2014 ఫిబ్రవరిలో ఆటో ఛార్జీలను సవరించారు. వాహనాల కొనుగోలు వ్యయం, ఇంధన ధరలు, నిర్వహణ ఖర్చులు, బీమా, డ్రైవర్ల జీవన వ్యయం పెరిగిన నేపథ్యంలో ఛార్జీలు పెంపును సిఫారసు చేస్తూ ప్రభుత్వ నియమించిన కమిటీ నివేదిక సమర్పించింది. ఈ సిఫారసుల మేరకే ప్రభుత్వం తాజా నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో, టీజీఎస్‌ఆర్టీసీ బస్సుల కోసం కామన్ పాస్‌ను ప్రారంభించిన రోజే ఈ ఛార్జీల పెంపు ఉత్తర్వులు వెలువడటం గమనార్హం.

## ఖైరతాబాద్‌లో వందశాతం మేమే గెలుస్తాం..

**హైదరాబాద్:** ఖైరతాబాద్ అసెంబ్లీ నియోజవర్గం ఉప ఎన్నికల్లో కచ్చితంగా తామే గెలుస్తామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తలసాని శ్రీనివాస్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. వందకు వందశాతం తామే గెలుస్తామన్నారు. ఉప ఎన్నికల్లో ప్రభుత్వ పార్టీకి కొంత అడ్వాన్స్ ఉంటుదనే మాట వాస్తవమే కావొచ్చు కానీ తాము ఇక్కడ గెలిచి చూపెడాతామన్నారు తలసాని. అక్కడ ఎమ్మెల్యేపై అనర్హత వేటు పడిన సందర్భంలో ఓటర్లు కూడా ప్రతిపక్ష పార్టీ పట్టం కడతారన్నారు. ఖైరతాబాద్ నియోజవర్గం అనేది ప్రత్యేకమైన నియోజకవర్గమన్నారు తలసాని. మీడియాతో చిట్‌చాట్‌లో భాగంగా తలసాని మాట్లాడుతూ.. సీఎం రేవంత్ సిరిసిల్ల పర్యటన ద్వారా ప్రభుత్వంపై చాలా వ్యతిరేకత వచ్చిందన్నారు. 'సీఎం రేవంత్ సిరిసిల్ల పోయాడు.. సిద్దిపేట పోత అంటున్నాడు.. తర్వాత మేము కొడంగల్‌లో సభ పెడతాం. రానున్న రోజుల్లో కరెంట్ కోతలు తీవ్రంగా రానున్నాయి.దేశ రాజకీయాల్లో సెంటిమెంట్ చాలా పని చేస్తోంది. మొన్న మాక్ అసెంబ్లీ పెడితే ఏం జరిగింది చూశాం. మాజీ ముఖ్యమంత్రి ఇంటి మీదకు భూ సర్వే కు పంపిస్తారా?, కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి ఎంపీలు వెళతారా?' అని ప్రశ్నించారు.

## బీరంగూడలో 'హంపి షాపింగ్‌మాల్' ప్రారంభం

**రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహ గౌడ్**

**స్థానికంగా వాణిజ్య రంగాలు విస్తరించడం శుభపరిణామం: ఎమ్మెల్యే**




**పటాన్ చేరు**

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోనిబీరంగూడ డివిజన్ శివాలయం చౌరస్తా వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన హంపి షాపింగ్ మాల్' ఘనంగా ప్రారంభమైంది. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి పటాన్‌చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ నరసింహ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి, రిబ్బన్ కట్ చేసి మాల్‌ను లాంఛనంగా ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, నందారం నరసింహ గౌడ్ మాట్లాడుతూ..బీరంగూడ పరిసర ప్రాంతాలు శరవేగంగా దినదినాభివృద్ధి చెందుతున్నాయని పేర్కొన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఇక్కడి ప్రజల అవసరాలు తీర్చేందుకు ఇలాంటి ఆధునిక షాపింగ్ మాల్స్ రావడం ఎంతో సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. గతంలో చిన్న వస్తువు కొనుగోలు చేయాలన్నా నగరానికి వెళ్లాల్సి వచ్చేదని, ఇప్పుడు స్థానికంగానే సకల సౌకర్యాలతో కూడిన షాపింగ్ మాల్స్ అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు సమయం, శ్రమ ఆదా అవుతాయని తెలిపారు. స్థానికంగా వ్యాపార, వాణిజ్య రంగాలు విస్తరించడం వల్ల యువతకు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయని వారు ఆకాంక్షించారు. వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు, ఉత్తమ సేవలు అందిస్తూ యాజమాన్యం వ్యాపారంలో మరింత ఉన్నతి సాధించాలని శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో షాపింగ్ మాల్ యాజమాన్య ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రముఖ నాయకులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

## జీవో నెంబర్ 25 రద్దు చేయాలి

**ఎస్జిటియుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం**



**వెల్దుర్తి**

విద్యాబోధనలో ఉపాధ్యాయులకు శాపంగామారిన జీవో నెంబర్ 25 ను ప్రభుత్వం రద్దుచేయాలని ఎస్జిటియు సంగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం అన్నారు. శుక్రవారం సంగం పిలుపుమేరకు ప్రభుత్వం ప్రాథమిక విద్య రంగాన్ని బలోపితం చేయాలని లక్ష్యంగా పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ అధికార పార్టీ నాయకులకు వెంకటేష్ ఆధ్వర్యంలో సంఘం బాధ్యులు వినతిపత్రాలు సమర్పించారు. వెంకటేశం మాట్లాడుతూ ప్రభుత్వం ఓవైపు విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తున్న శుభ సందర్భంలో విద్యార్థులకు ఉపాధ్యాయుల కొరుతతో తరగతి గదిలో అనుకున్న సామర్థ్యాల విద్యాబోధనలో చేపడుతున్న కొత్త విధానాల అమలుతో ప్రాథమిక పాఠశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారి పేద విద్యార్థుల పాలిట శాపంగా ఆశాస్త్రీయంగా ఉన్న ఉపాధ్యాయులకు పని భారం ఒత్తిడి పెరుగుతుందన్నారు. స్వేచ్ఛ వాతావరణంలో పెరిగే బోధనలకు అంతరాయం కలిగే విధంగా ప్రభుత్వం తీరుందన్నారు. విద్యారంగ మార్పులు ఉపాధ్యాయులను విదేశాల్లో అమలు అవుతున్న విద్యా విధానాన్ని అధ్యయనం చేసి ఇక్కడ అమలు చేయాలని చేస్తున్న తరుణంలో 20 నుండి 60 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులతో ఐదు తరగతులు ఐదు తరగతులకు 18 సబ్జెక్టులు బోధనతోపాటు ఇతర ప్రభుత్వ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు పాల్గొనడం పట్ల పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన గుణాత్మకమైన విద్య ఎలా అందుతుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనకోసంశు క్రవారంనగరంలోనిఇందిరాపార్క్ వద్ద జరగాల్సిన

అమరణ నిరాహార దీక్ష పోలీసుల అనుమతి రాకపోవడంతో ఇలా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు సత్యం నర్సాపూర్ తూప్రాన్ మండలాల అధ్యక్షుడు గణేష్ యాదగిరి లుపాల్గొన్నారు.

## టాస్కా చిల్కానగర్ డివిజన్ నూతన శాఖ ఘనంగా ఆవిర్భావం

**చిల్కానగర్**

తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ (టాస్కా) చిల్కానగర్ డివిజన్ నూతన శాఖ ఆవిర్భావ సమావేశం శుక్రవారం చిల్కానగర్‌లోని నోవా బాంకెట్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. డివిజన్ పరిధిలో వివిధ రంగాల్లో సేవలందించి 60 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సుమారు 100 మంది సీనియర్ సిటిజన్లు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.శాఖ అధ్యక్షుడు బొమ్మగాని దాస్ గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి మేడ్చల్--మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉప్పల్ తహసీల్దార్ పూల్ సింగ్ చౌహాన్, ఉప్పల్ ఏసీపీ వెంకట్ రెడ్డి, టాస్కా రాష్ట్ర అధ్యక్షుడు పి. నరసింహారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌదరి, మేడ్చల్ జిల్లా ఇన్‌చార్జి వెంకటయ్య గౌడ్, రాజిరెడ్డి, బీజేపీ ఉప్పల్ కన్వీనర్ దేవసాని బాలచందర్, నెర్థం భాస్కర్ గౌడ్, అంబటి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని తొలుత గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీనియర్ సిటిజన్ల సేవలు సమాజానికి మార్గదర్శకం ఈ సందర్భంగా సీపీ బి. సుమతి మాట్లాడుతూ, నేడు సమాజం అనుభవిస్తున్న అభివృద్ధి, సంపద, సౌకర్యాల వెనుక గత తరాల సీనియర్ సిటిజన్ల కృషి, త్యాగం, సేవలు ఉన్నాయని అన్నారు.

## బీజేపీలో చేరిన సీరియల్ నటులు..

తెలంగాణలో బీజేపీలో పలువురు టెలివిజన్ సీరియల్ కళాకారులు చేరారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఈరోజు జరిగిన కార్యక్రమంలో టీవీ నటి వేములపల్లి స్వర్ణలతతో పాటు మరికొందరు సీరియల్ నటులు కాషాయ కండువా కప్పుకున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాంచందర్ రావు మాట్లాడుతూ... అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ఆ రెండు పార్టీలు ఒకరిపై ఒకరు అక్రమ సంపాదన ఆరోపణలు చేసుకోవడంలోనే మునిగిపోయాయని, సామాన్యుడు ఏం సంపాదించాడని ఎప్పుడైనా పట్టించుకున్నాయా అని ప్రశ్నించారు. వంద రోజుల్లో బీఆర్ఎస్ అవినీతిని బయటపెడతామని చెప్పిన కాంగ్రెస్, వెయ్యి రోజులు గడిచినా ఒక్కరినీ జైలుకు పంపలేకపోయిందని ఆయన ఎద్దేవా చేశారు. అవినీతిలో కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకదానితో ఒకటి పోటీ పడుతున్నాయని రాంచందర్ రావు ఆరోపించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ప్రీమియం చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని, తమ సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులను అరెస్ట్ చేయించిందని మండిపడ్డారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే విద్యార్థులు, ఉపాధ్యాయులు, రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ వైఖరితో ప్రజలు విసిగిపోయారని, రాష్ట్రంలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వినోద రంగంలోని ప్రముఖులను చేర్చుకోవడం ద్వారా పార్టీ బలోపేతానికి బీజేపీ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా ఈ చేరికలు జరిగాయి.

## 'అనంత్ అంబానీ రాష్ట్ర ముద్దుబిడ్డ

-మొదటిపేజీ తరువాయి

గురయ్యారు. తనను ఆంధ్రప్రదేశ్ బిడ్డగా భావించాలని, రాష్ట్ర అభివృద్ధికి తాను ఏం చేయాలో మార్గనిర్దేశం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. ఆయన ప్రసంగానికి సభికుల నుంచి విశేష స్పందన లభించింది. అనంత్ ప్రసంగం ముగియగానే కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఆయనను అభినందించారు. అనంతరం ప్రసంగించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, అనంత్ అంబానీ మాటలపై స్పందించారు. "అనంత్ అంబానీని మన రాష్ట్ర ముద్దుబిడ్డగా భావిస్తున్నాం. రాష్ట్ర అభివృద్ధిలో రిలయన్స్ సంస్థ మరింతగా భాగస్వామి కావాలి" అని వేదికపై నుంచి ప్రకటించారు. మదనపల్లెలో ఏర్పాటు చేయనున్న గ్లోబల్ హార్టికల్చర్ హబ్ (+ఎఎ), ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (×ూూ)కు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, అనంత్ అంబానీ, మంత్రి నారా లోకేశ్ కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సుమారు రూ.లక్ష కోట్ల అంచనా వ్యయంతో ఈ హబ్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో రూ.40 వేల కోట్లు కేంద్ర ప్రభుత్వ సహకారంతో, మరో రూ.60 వేల కోట్లు ప్రైవేటు పెట్టుబడుల ద్వారా సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా రాయలసీమలో ఉద్యాన రంగం అభివృద్ధి, రైతుల ఆదాయం పెంపు, ఆధునిక సాగు విధానాలు, ఎగుమతుల ప్రోత్సాహానికి బాటలు పడతాయని ప్రభుత్వం వివరించింది.

కార్యక్రమం అనంతరం ముఖ్య నేతలు మొక్కలు నాటారు. ఉద్యాన రంగానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ సమావేశంలో మంత్రులు అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్, బీసీ జనార్దన్ రెడ్డి, రాంప్రసాద్ రెడ్డి, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## రాయలసీమ రైతుల తల రాతలు

## మారబోతున్నాయి: పవన్ కల్యాణ్

రాయలసీమను ప్రపంచ స్థాయి ఉద్యాన కేంద్రంగా (గ్లోబల్ హార్టికల్చర్ హబ్) తీర్చిదిద్దే ప్రాజెక్టుకు శుక్రవారం అంకురార్పణ జరిగింది. మదనపల్లెలో 'రాయలసీమ రైజింగ్' పేరుతో చేపట్టిన ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... రూ. లక్ష కోట్ల పెట్టుబడితో చేపడుతున్న ఈ ప్రాజెక్టుతో రాయలసీమ రైతుల తలరాతలు మారబోతున్నాయని, ఇది ఒక చరిత్రాత్మక ఘట్టమని అన్నారు. కష్టపడి పనిచేసే సీమ రైతులకు ప్రభుత్వం అండగా నిలిచి, సాంకేతికతను అందిస్తే అద్భుతాలు సృష్టిస్తారని కొనియాడారు. హార్టికల్చర్ హబ్‌తో పాటు, అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేయనున్న ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్‌కు కూడా పునాదిరాయి వేశామన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా సీమలోని కరవు పీడిత ప్రాంతాల్లో ఉద్యాన పంటల సాగును గణనీయంగా పెంచుతామని, సూక్ష్మ సేద్యం ద్వారా నీటి సంరక్షణకు పెద్దపీట వేస్తామని పవన్ తెలిపారు. రైతులు పండించే నాణ్యమైన పంటలకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ మెగా ప్రాజెక్టులతో రాయలసీమ జిల్లాల్లోని లక్షలాది మంది రైతులకు స్థిరమైన ఆర్థిక భద్రత లభిస్తుందని... ఈ ప్రాజెక్టు దేశ వ్యవసాయ రంగంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రపంచానికి భారత ఆధ్యాత్మిక జ్ఞానం

## పరిష్కారం చూపుతుంది: మోహన్ భగవత్

భారతదేశంలో ధర్మం, దేశం వేర్వేరు కావని, ప్రపంచం ఎదుర్కొంటున్న అనేక సవాళ్లకు భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానమే పరిష్కారం చూపగలదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ పేర్కొన్నారు. శుక్రవారం నిర్వహించిన అఖిల భారత విహార్ సేవా గ్రూప్ 14వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా భగవత్ మాట్లాడుతూ, "మన దేశం, ధర్మం పరస్పర భిన్నమైనవి కావు. దేశానికి ధర్మమే ప్రాణాధారం, ధర్మమే దేశాన్ని సుస్థిరపరుస్తుంది. ఈ రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉన్నాయి" అని స్పష్టం చేశారు. నేడు ప్రపంచం అభివృద్ధి-పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత స్వేచ్ఛ-కుటుంబ వ్యవస్థ, మత విశ్వాసం-సంఘర్షణ వంటి అనేక వైరుధ్యాలతో సతమతమవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. "ప్రపంచం ప్రస్తుతం అస్తవ్యస్తంగా ఉంది. ఏ ఆనందమూ పరిపూర్ణంగా లభించడం లేదు. ఎక్కడా సమతుల్యత కనిపించడం లేదు, అతివాదం పెచ్చరిల్లుతోంది" అని ఆయన విశ్లేషించారు. ఇలాంటి సంక్లిష్ట పరిస్థితులకు పరిష్కారం కోసం ప్రపంచం భారతదేశం వైపు ఆశగా చూస్తోందని భగవత్ అన్నారు. "ఈ సమస్యల నుంచి గట్టెక్కించే మార్గం భారత్ నుంచే వస్తుందని ప్రపంచ దేశాలకు తెలుసు" అని ఆయన వ్యాఖ్యానించారు. వేదాలు, ఉపనిషత్తులు, రామాయణం భారతాలు, భగవద్గీతతో పాటు జైన ఆగమాలు, త్రిపిటకాలు, గురు గ్రంథ్ సాహిబ్ వంటి అత్యున్నత జ్ఞాన సంపద మన దేశానికి ఉందని గుర్తుచేశారు. ఈ జ్ఞానాన్ని పుణికిపుచ్చుకున్న వారిని, వారి సంప్రదాయాలను కాపాడటం కేవలం ఒక మతపరమైన బాధ్యత మాత్రమే కాదని, అది సమస్త మానవాళికి చేసే సేవ అని కొనియాడారు. "మీరు కేవలం ఒకరి ప్రాణాన్ని కాపాడటం లేదు, మొత్తం మానవజాతి సురక్షిత భవిష్యత్తును రక్షిస్తున్నారు" అని భగవత్ ఉద్ఘాటించారు.

## అక్టోబర్ 18న మోత్కూర్‌లో యూత్ ఎంపవర్‌మెంట్ ఫెస్ట్--2026

# పోస్టర్లు ఆవిష్కరించిన ప్రభుత్వ విప్ వేముల వీరేశం

**నకిరేకల్, (ప్రజానేస్తం జ్వాల):** యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్‌లో పసలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 18న నిర్వహించనున్న యూత్ ఎంపవర్‌మెంట్ ఫెస్ట్--2026 పోస్టర్లను నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. యువతకు విద్య, నైపుణ్యాభివృద్ధి, కెరీర్ మార్గదర్శకత్వం, నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించి వారిని సాధికారత దిశగా తీసుకెళ్లే ఉద్దేశంతో ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు పసలా ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు ఫాదర్ జూలియన్, పీఆర్ డైరెక్టర్, స్పోక్స్‌పర్సన్ చిలువేరు శంకర్, రీజినల్ మేనేజర్ పసలా విజయానంద్ ఎమ్మెల్యే వేముల వీరేశాన్ని మర్యాదపూర్వకంగా కలిసి ఫెస్ట్‌కు గౌరవ అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. వేముల వీరేశం మాట్లాడుతూ యువత అభివృద్ధికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. విద్య, ఉపాధి, నైపుణ్య శిక్షణ రంగాల్లో యువతకు అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పసలా ఫౌండేషన్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని పేర్కొన్నారు.




# కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కుల పంపిణీ

**సహాయం కాదు ఇది ఎమ్మెల్యేగా నా బాధ్యత**
**తూడి మేఘారెడ్డి.**



**వనపర్తి :** రూ. 3459 కోట్ల అభివృద్ధి పనులు. భజ్యాతి రాష్ట్ర సమితి ఃఖీూ హయాంలో సంక్షోభం.నేడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సంక్షేమం.కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో 30 నెలల్లో వనపర్తి నియోజకవర్గం లో దాదాపు 100 కోట్లకు సంబంధించిన అఓఖీఈ, ఒూఅ, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేసినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.శుక్రవారం వనపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అఓఖీఈ, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని ఆయన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.వనపర్తి నియోజకవర్గం లోని ప్రతి కుటుంబానికి తాను ఒక పెద్ద కొడుకులా పనిచేస్తున్నానని నేను చేసే ప్రతి పని వారికి సహాయం కాదని ఎమ్మెల్యేగా తన బాధ్యత అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.గతంలో అధికారంలో ఉన్న ఎతీబ పార్టీ నాయకులు ఈ క్యాంపు కార్యాలయంలోకి ఏ ఒక్కరిని అనుమతించేవారు కాదని నేడు ప్రజా ప్రభుత్వంలో ఎలాంటి ఆంక్షలు లేకుండా అందరూ సమానంగా క్యాంపు కార్యాలయం కార్యాకాల పళ్ళు పాల్గొంటున్నారని ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి నిరుపేద కుటుంబానికి సంక్షేమ ఫలాలు అందుతుయన్నారు. ఆర్టీసీల్లో ప్రయాణించే మహిళలకు ప్రభుత్వం తరఫున ఇప్పటివరకు 12 వేలకోట్ల రూపాయలు ప్రభుత్వం చెల్లించిందని ఆయన తెలిపారు.200 యూనిట్ ఉంచి విద్యుత్ కోసం 6000 కోట్లు ప్రభుత్వం చెల్లించిందన్నారు.వనపర్తి నియోజకవర్గంలోనే 32,000 మందికి రేషన్ కార్డు అందించి వారికి సన్న బియ్యం చేస్తున్న ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్సేనని ఎమ్మెల్యే అన్నారు.విద్యాభివృద్ధి కోసం 600 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతుయన్నారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బం దులు లేకుండా మిస్ చార్జీలు పెంచిందని, పాఠశాల దుస్తుల పంపిణీలో పుస్తకాల పంపిణీలోఎలాంటి ఇబ్బందు లేకుండా ముందస్తుగానే పంపిణీ చేపట్టిందన్నారు.500 పడకల ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ పాఠశాల, తెలంగాణ పబ్లిక్ స్కూల్, లాంటి ఉన్నత విద్యపై ప్రభుత్వం దృష్టి సారించి తెలంగాణ రాష్ట్రాన్ని విద్యాభివృద్ధిలో దేశంలోనే ముందుంచేందుకు చర్యలు చేపట్టిందన్నారు.నిరుద్యోగులకు ఉద్యోగ కల్పన, రుణమాఫీ రైతు భరోసా రైతు బీమా లాంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి రైతుకు వెన్ను దన్నుగా నిలుస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు, విద్యార్థులకు దుస్తుల కుట్టడం, సోలార్ ప్లాంట్ లో ఏర్పాటు, ఉచిత బస్సు ప్రయాణం, మహిళా సమైక్యలకు ఆర్టీసీ బస్సులు కొనుగోలులో భాగస్వామ్యం, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అమలుపరుస్తోందన్నారు.గత ప్రభుత్వం కేవలం రోడ్ల వెంట లైట్లు వేసుకుంటూ డివైడర్లు నిర్మించుకుంటూ చెరువు కట్టలపై రివిట్మెంట్ కట్టి అందిన కాడికి కమిషన్లు దండుకొని పోయిందని నిరుపేద ప్రజలకు ఏమి చేయలేదని ఎమ్మెల్యే విమర్శించారు.ఎల్నినో ప్రపంచ మంతా ఇబ్బందులు ఎదుర్కొంటుందని దాని ప్రభావంతో ఉన్న ఇబ్బందులను అధిగమించేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రత్యేక కమిటీ ద్వారా చర్యలు చేపడుతుందని ఎమ్మెల్యే తెలిపారు.గత ప్రభుత్వం చేసిన అప్పులను కడుతూనే అన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. హామీల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చి ఇచ్చిన హామీల్లో భాగంగా మిగిలిపోయిన మూడు హామీలను సైతం త్వరలోనే అమలుపరుస్తుం దన్నారు. బజ్యాతి రాష్ట్ర సమితి గురించి కెసిఆర్ కూతురు కవిత కెసిఆర్ చుట్టూ దొంగలు చేరారని గుంటనక్క హరీష్ రావు, పొట్టోడు ఎబితీ లు పార్టీని పూర్తిగా నిర్వీర్యం చేశారని అలాంటివారిని ప్రజలు నమ్మే పరిస్థితులు లేరని చెప్పడం విశేషమని ఎమ్మెల్యే అన్నారు. కాంట్రాక్టర్ గా చేసుకుంటూ, వ్యవసాయం చేసుకుంటూ పాలముకుంటూ కూలివాడిలాగా పనిచేసుకుంటే తప్పు కాదని కబ్జాలు చేస్తూ కమిషన్లు మింగుతూ ప్రజలను మోసం చేస్తే తప్పని కొందరు సన్యాసులు తనను కూలోడని మాట్లాడడం పై ఎమ్మెల్యే విమర్శించారు.కొల్లాపూర్ లో తన్ని తరిమేస్తే తెలంగాణ సెంటిమెంటును అడ్డుపెట్టుకొని విద్యార్థుల శవాలపై రాజకీయం చేసి అధికారుల్లోకి వచ్చిన మోసగాళ్లు ఒకేసారి ఎమ్మెల్యేగాయి వేళ్ళ కోట్లు దండుకుంటే ప్రజలు తన్ని తరిమేశారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు.కేంద్రంలో ఖార్గే ని, రాష్ట్రంలో స్పీకర్ ని దళితులని అవమానించి పసుపు నీళ్లతో శుద్ధి చేసే దొరల పాలన కాకుండా నేడు రేవంత్ రెడ్డి ప్రజా పాలన నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

# రాజనగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

**అభివృద్ధి పనులకు ప్రాధాన్యత**
**వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి.**




**వనపర్తి :** రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి. రాజనగర గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ వంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామంలో ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి రాజనగరాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామని తెలిపారు.గాంధీ జయంతి సందర్భంగా రాజనగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఆవిష్కరించి, మహాత్మునికి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో ఆర్చి నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. అలాగే గ్రామంలో నిర్మాణం పూర్తిచేసుకుని ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పల్లె దవాఖానాను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో సిసి డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుని గృహప్రవేశం చేసిన లబ్ధిదారుల ఇళ్లకు ఎమ్మెల్యే స్వయంగా వెళ్లి, వారిని శాలువాలతో సన్మానించి నూతన వస్త్రాలను అందజేశారు. పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని పేర్కొన్నారు.ఈ సందర్భం గా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికే సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, బ్రిడ్జి నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఎమ్మెల్యే తెలిపారు.ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు.రాజనగర గ్రామ అభివృద్ధికి ప్రభుత్వం, తన వంతు నుంచి పూర్తి సహకారం అందిస్తుందని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పిస్తూ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.ప్రజల భాగస్వామ్యంతో రాజనగరాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి స్పష్టం చేశారు.కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ నక్క రాణి రాజు, వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి ూఒఔ రమేష్, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, వనపర్తి పట్టణ అధ్యక్షులు కదిరే రాములు, అధికార ప్రతినిధి కోళ్ల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షులు వాకిటి ఆదిత్య, ఔూజఎ అధ్యక్షులు శ్రీకాంత్ కాంగ్రెస్ పార్టీ జర్నల్ సెక్రెటరీ బ్రహ్మం చారి, మాజీ జెడ్పీటిసి గొల్ల వెంకటయ్య, మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, వనపర్తి పట్టణ కౌన్సిలర్లు గ్రామ కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, గొడుగు రామకృష్ణ, సంజీవ్ సాగర్, నారాయణ, కందుర్ గోపాల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రెడ్‌క్రాస్ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా సిరిసిల్ల శ్రీనివాస్.. జగిత్యాలలో ఘన సన్మానం



**జగిత్యాల జిల్లా (ప్రజానేస్తం జ్వాల):** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా సీనియర్ జర్నలిస్ట్, 'తెలంగాణ రిపోర్టర్' ఎడిటర్ సిరిసిల్ల శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా ఆయనకు అభినందనలు వెల్లువెత్తాయి. గురువారం జగిత్యాలలోని ఆయన స్వగృహంలో తుంగూర్ సర్పంచ్, బీర్‌పూర్ మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు అర్షకోట రాజగోపాల్ రావు ఆధ్వర్యంలో గ్రామ ప్రముఖులు శ్రీనివాస్‌ను శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అర్షకోట రాజగోపాల్ రావు మాట్లాడుతూ సమాజ సేవలో నిరంతరం ముందుండే సిరిసిల్ల శ్రీనివాస్ రెడ్‌క్రాస్ రాష్ట్ర మేనేజింగ్ కమిటీకి ఏకగ్రీవంగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. రక్తదానం, విపత్తుల సమయంలో సహాయక చర్యలు, ఉచిత వైద్య శిబిరాలు తదితర మానవతా సేవల్లో రెడ్‌క్రాస్ కీలక పాత్ర పోషిస్తోందని, శ్రీనివాస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. సిరిసిల్ల శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. రెడ్‌క్రాస్ ద్వారా రక్తదానంపై అవగాహన, వైద్య సహాయం, ప్రథమ చికిత్స శిక్షణ వంటి సేవా కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనను అభినందించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుంగూర్ ఉపసర్పంచ్ శీలం లింగన్న, వార్డు సభ్యుడు బండారి తిరుపతి, గ్రామ పెద్దలు అర్షకోట రమేష్ బాబు, బీర్‌పూర్ మండల పాత్రికేయులు ఆడెపు వెంకటేష్, అర్షకోట అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలపై బీజేపీ కార్యవర్గ సమావేశం

**కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలి: బండ కార్తిక రెడ్డి**



**సూర్యాపేట, (ప్రజానేస్తం జ్వాల):** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సూర్యాపేట జిల్లాలో బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండ కార్తిక రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. పట్టభద్రుల ఓటర్లను కలుస్తూ పార్టీ విధానాలు, అభ్యర్థి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షురాలు చల్ల శ్రీలత రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి రామినేని అశోక్, గరిడేపల్లి మండల ఉపాధ్యక్షులు కుక్కడపు లక్ష్మయ్య, పల్లి జగన్నా, కుక్కడపు సైదులు, పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత స్టడీ మెటీరియల్ పంపిణీ

**చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు ఎదగాలి: ప్రభుత్వ విప్ వేముల వీరేశం**



**నకిరేకల్ (ప్రజా నేస్తం జ్వాల):** ఉద్దీపణ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందిస్తున్న ఉచిత స్టడీ మెటీరియల్‌ను ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వేముల వీరేశం మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. విద్యార్థుల భవిష్యత్తుకు విద్యే పునాది అని, ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ అందించడం అభినందనీయమని, ఇలాంటి సహాయం విద్యార్థుల చదువుకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని లక్ష్యాలను సాధించాలని ఆయన సూచించారు.

## గాంధీజీ ఆశయాలు స్ఫూర్తిగా ప్రజాసేవలో ముందుకు సాగాలి

**నల్లగొండలో గాంధీ విగ్రహానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నివాళులు**



**నల్లగొండ, (ప్రజానేస్తం జ్వాల):** జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా నల్లగొండలోని గాంధీజీ విగ్రహానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సత్యం, అహింస, శాంతి మార్గాల్లో దేశానికి దిశానిర్దేశం చేసిన మహాత్మా గాంధీ ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. గాంధీజీ చూపిన మార్గంలో నడుస్తూ ప్రజాసేవలో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో మహాత్మా గాంధీ పోషించిన పాత్ర, ఆయన సిద్ధాంతాలు నేటి తరానికి కూడా ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.